

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చీరాలకు చెందిన జి.రవికుమార్ రూ.1,01,016 విరాళంగా అందజేశారు. దాతను జ్ఞాపికతో సత్కరించారు.



మహానందిలో సందడి

మహానంది: కార్తీకమాసం, శనివారం వీకెండ్ కావడంతో మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. భక్తులు స్థానిక కోనేరుల్లో స్నానాలు ఆచరించి స్వామిఅమ్మ వార్లను దర్శించుకున్నారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: కార్తీక ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం దేవస్థానం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

కేసీ కెనాల్‌కు 2,885 క్యూసెక్కులు



పాములపాడు: కేసీ కెనాల్‌లో శనివారం 2,885 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 450 క్యూసెక్కులు, సుంకేసుల రిజర్వాయర్ నుంచి 2,435 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదలవుతున్నట్లు చెప్పారు. కాగా ఈ నీటిని మండలంలోని శాంతి నిలయం సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాగిన్స్‌లా నుంచి నిప్పుల వాగుకు 2,237 క్యూసెక్కులు, తూడిచెర్ల ఎస్కేప్ చానల్‌కు 510, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 138 క్యూసెక్కుల చొప్పున మళ్లిస్తున్నట్లు వివరించారు.

కొలనుభారతిలో కార్తీకమాస పూజలు

కొత్తపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలోని కొలనుభారతి దేవి ఆలయంలో శనివారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలంకరణ చేసి మహామంగళహారతిని ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ చేశారు. అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన, చిన్నారులకు బీజాక్షరాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సప్తశివాలయాల్లో కూడా భక్తులు పంచసూక్త మహాభిషేకములు, ఏక బిల్వంతో పూజలు చేపట్టి దర్శించుకున్నారు.

నాపరాతి పరిశ్రమ పురోగతికి కృషి

- గ్రానైట్ పరిశ్రమతో సమానంగా రాయితీలు
- విద్యుత్ చార్జీలలో యూనిట్‌పై రూ.2 తగ్గింపునకు నిర్ణయం
- భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- కాలుష్య నియంత్రణకు మైనింగ్ యజమానులు సహకరించాలి - మంత్రి బుగ్గన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశానికి హాజరైన నాపరాతి గనుల యజమానులు

బనగానపల్లె: నాపరాతి పరిశ్రమ పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన నాపరాయి గనుల యజమానుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ప్రాంతంలో మైనింగ్ యజమానుల సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎంతో చొరవ చూపుతున్నారన్నారు. నాపరాయి గనులపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం అండగా నిలిచిందని వివరించారు. సీఎఫ్ఓ విషయంలో మూడేళ్ల గడవును ఐదు ఏళ్లలోపు చెల్లించేలా నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. క్వారీ డెడ్ రెంట్ కాల వ్యవధిపై పరిశీలించి సానుకుల నిర్ణయం తీసుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా మైనింగ్ పరిశ్రమకు విద్యుత్ చార్జీల తగ్గింపుపై ఇచ్చిన హామీ మేరకు యూనిట్‌కు రూ.2 తగ్గిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రానైట్ పరిశ్రమలకు ఇచ్చే రాయితీలను నాపరాతి పరిశ్రమలకు కూడా అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం నెరవేర్చామన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలుతో పాటు రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాల అమలు చేయడంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

గోరంతను కొండంత చేస్తున్న టీడీపీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులు టీడీపీ నాయకులకు కనిపించడం లేదని, ఎక్కడైనా కొంత లోపాలు ఉంటే వాటిని కొండంత చేసి ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ జనరంజక పాలన కొనసాగిస్తుందన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరన్నారు. నాపరాతి యజమానులు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో నాపరాతి పరిశ్రమను విస్మరించడంతో గనుల యజమానులు, కార్మికులు ఎంతో నష్టపోయారన్నారు. డీఎంఎఫ్ నిధుల ద్వారా బనగానపల్లె పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి దక్కిందన్నారు. మైనింగ్ పరిశ్రమకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సానుకులంగా స్పందించి పరిష్కరిస్తారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు మైనింగ్ యజమానులు కాలుష్య నియంత్రణకు సహకరించాలన్నారు. సీఎఫ్ఓ మూడు సంవత్సరాల కాలవ్యవధి ప్రకారం విధించే పన్ను అన్ని వెహికిల్ ట్రాకింగ్ సిస్టం పైన వెసులుబాటు దిశగా సమీక్షిస్తామని తెలిపారు. రెన్యువల్‌పైన డెడ్ రెంట్ మూడు నెలలకు ఒకసారి చెల్లించే పద్ధతిపై యజమానుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. క్లస్టర్ల ద్వారా పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయన్నారు.

మైనింగ్ పరిశ్రమకు అండగా ప్రభుత్వం

నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి, గనుల యజమానులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మైనింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవ అభినందనీయమన్నారు. గని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మైనింగ్ పరిశ్రమలో నెలకొన్న మరిన్ని సమస్యలను మైనింగ్ యజమానులు గుండం శేషిరెడ్డి, సుజాతశర్మ, దస్తగిరి, ఖాన్, మరికొందరు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా మైనింగ్ అధికారులు రామచంద్ర, రాజగోపాల్ రాజశేఖర్‌తో పాటు ఎంపీడీఓ శివరామయ్య నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి మైనింగ్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

5 శాతానికి జీఎస్టీ తగ్గింపు

నాపరాత్రి పరిశ్రమపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఐదు శాతానికి తగ్గించి మైనింగ్ యజమానులకు ఊరట కల్పించారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో మైనింగ్ చెక్‌పోస్టులు ఉండగా మన జిల్లాలో ప్రభుత్వ సహకారంతో చెక్‌పోస్టులు లేకుండా చేశామన్నారు. చాలా కాలంగా నాపరాతి మైనింగ్ ధరలు యథావిధిగా ఉన్నాయని, యజమానులకు గిట్టుబాటు అయ్యేలా ధరలు పెంచేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి ఇచ్చిన హామీల పట్ల ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గనులు అధికంగా ఉన్న బనగానపల్లెలో మైనింగ్ యజమానుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడంతో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం లభించిందన్నారు. నాపరాతి పరిశ్రమకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ గెలిపించాలని కోరారు.

జేజేఎం పనులకు పుష్కలంగా నిధులు

- జీడీపీ నీటితో కోడుమూరు ప్రజల దాహార్తి తీరుస్తాం
- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- హుందాగా సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం
- హాజరైన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు ఆర్థర్, బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్లు సృజన, మనజీర్ జిలానీ శామూన్ తదితరులు

కర్నూలు(అర్బన్): జలజీవన్ మిషన్ (జేజేఎం) కింద చేపట్టే పనులకు నిధులు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఈ పథకం కింద పనులు చేపట్టేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న వారిని, కాంట్రాక్టర్లను టెండర్లలో పాల్గొనేలా స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్లను కోరారు. శనివారం స్థానిక జెడ్పీ సమావేశ భవనంలో చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంత్రి బుగ్గనతో పాటు నందికొట్కూరు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, గంగుల బిజేంద్రారెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు డాక్టర్ గుమ్మళ్ల సృజన, డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, నంద్యాల జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఐవి సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మాట్లాడుతూ.. జేజేఎం పనులు నత్తనడకన సాగుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకురాగా మంత్రి బుగ్గన పై విధంగా వ్యాఖ్యానించారు.

ఎల్ఎల్‌సీ నుంచి గాజులదిన్నెకు నీరు

నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో తాగునీటి ఎద్దడి నెలకొందని జెడ్పీటీసీ సభ్యుడు బి రఘునాథరెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. హెచ్ఎస్ఎస్ఎస్ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు విడుదల చేసి ఆ నీటిని హంద్రీకి వదిలితే సమస్య కొంతమేర పరిష్కారమవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి బుగ్గన మాట్లాడుతూ ఇప్పటికే తుంగభద్ర దిగువ కాలువ నుంచి రోజుకు 200 క్యూసెక్కుల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు తీసుకుంటున్నామని, జీడీపీలో 2 టీఎంసీల నీటిని నిల్వ చేసి కోడుమూరు తాగునీటి అవసరాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ కొన్ని నియమాల ప్రకారం ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిందని చెప్పారు. వర్షపాతం నమోదు, భూమిలో ఉండే తేమ తదితర నాలుగైదు అంశాల ఆధారంగా కరువు మండలాలను ప్రకటిస్తారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిగిలిన మండలాలను కూడా రెండో జాబితాలో కరువు మండలాలుగా ప్రకటించాలని జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు.

లేఅవుట్ల మార్పునకు పరిశీలించండి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జగనన్న కాలనీలకు సంబంధించిన లే అవుట్‌లు దూరంగా ఉండడం వల్ల గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని పలువురు జెడ్పీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కోడుమూరులో 1,140 ఇళ్లు మంజూరయ్యాయని, లే అవుట్ దూరంగా ఉండడం వల్ల లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోలేరని జెడ్పీటీసీ సభ్యుడు.. మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలపై స్థానిక తహసీల్దార్లతో మరోసారి స్థలాలను పరిశీలించి ఆయా లే అవుట్‌లను మార్చేందుకు అవకాశం ఉందా లేదా అనే విషయాలను పరిశీలించాలని కలెక్టర్లను కోరారు. గృహ నిర్మాణాల్లో ఎక్కువ శాతం మిస్‌మ్యాచింగ్ జరుగుతోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చెప్పారు.

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాలపై దృష్టి పెట్టండి

మండల పరిషత్ అధ్యక్షులను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీకి చైర్మన్‌లుగా నియమించినా ఇంతవరకూ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీహెచ్‌సీ స్థాయిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలను వెంటనే నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్యను ఆదేశించారు.

→ సమావేశం ప్రారంభంలో కల్లూరు జెడ్పీటీసీ ఆళ్ల ప్రభాకర్‌రెడ్డి అకాల మరణం పొందిన సందర్భంగా మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, రెండు జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

→ జెడ్పీ పాత భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి పర్యాటక శాఖకు లీజుకు ఇవ్వడం కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు

నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ జిల్లా పర్యటన

నంద్యాల(అర్బన్): ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఆదివారం నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారని జీపీఎస్ అధ్యక్షులు రాజు నాయక్ శనివారం తెలిపారు. ఉదయం ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి బయలుదేరి శిరివెళ్ల మండలం మహదేవపురం ఎరుకల కాలనీని సందర్శిస్తారన్నారు. అనంతరం నంద్యాల చేరుకుని ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పాణ్యం మండల కేంద్రంలోని గురుకుల రెసిడెన్షియల్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించనున్నారన్నారు. సుగాలిమెట్ట గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం సమావేశం నిర్వహించి మహానంది దర్శనానికి వెళ్తారన్నారు.

ఎమ్మిగనూరులో గద్వాల కాటన్ చీరల ఉత్పత్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో గద్వాల కాటన్ చీరలు కూడా ఉత్పత్తి చేస్తున్నట్లు సెక్రటరీ వెంకటేశ్వరరావు తెలిపారు. 2022లో 5 మగ్గాలతో ఉత్పత్తిని ప్రారంభం కాగా.. ఇప్పుడు 25 మగ్గాలకు చేరిందన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 2021 వరకు కేవలం పంచలు, టువాళ్లు, దోమ తెరలు, బెడ్‌షీట్లు, దుప్పట్లు తదితరాలు మాత్రమే ఉత్పత్తి చేశామన్నారు. మొదటి సారిగా గద్వాల కాటన్ చీరల ఉత్పత్తి చేపట్టామని, వీటికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కాటన్ చీరల్లో సీకో చీరలు, ప్లెయిన్ బుట్టా చీరలు, కడ్డీ చీరలు, కుట్టు చీరలు ఉత్పత్తి చేస్తున్నామని, వీటిని ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం డిపోల్లోనే విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం ఉత్పత్తి చేసే చేనేత వస్త్రాల ద్వారా 2022-23లో రూ.2.30 కోట్ల టర్నోవర్ ఉందన్నారు.

శ్రీశైలం నుంచి బెంగళూరుకు నాన్ ఏసీ స్లీపర్‌బస్

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రం నుంచి బెంగళూరుకు 30 బెర్త్‌ల నాన్ ఏసీ స్లీపర్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాము సూపర్ లగ్జరీ బస్సు నడిపామని, దాని స్థానంలో నాన్ ఏసీ స్లీపర్‌బస్ సర్వీసు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజు శ్రీశైలంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమై ఆత్మకూరుకు రాత్రి 7.30కు, కర్నూలుకు రాత్రి 9 గంటలకు చేరుకుని బెంగళూరుకు వెళ్తుందన్నారు. ఇందుకు శ్రీశైలం నుంచి బెంగళూరుకు అప్పర్ బెర్త్‌లో పెద్దలకు చార్జీ రూ.1,370, పిల్లలకు రూ.1,030, ఆత్మకూరు- బెంగళూరుకు పెద్దలకు రూ.1,000, పిల్లలకు 750, కర్నూలు నుంచి పెద్దలకు రూ.850, పిల్లలకు రూ 640 చొప్పున, లోయర్ బెర్త్‌కు శ్రీశైలం నుంచి బెంగళూరుకు రూ.1,500, పిల్లలకు 1,330, ఆత్మకూరు నుంచి పెద్దలకు రూ.1,090, పిల్లలకు రూ.820, కర్నూలు నుంచి 920, పిల్లలకు రూ. 690 చొప్పున చార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. వివరాలకు 9381980257ను సంప్రదించాలన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజన విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి అన్నారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాల క్రీడాకారులకు శనివారం సున్నిపెంట ఎస్టీ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జన జాతీయ గౌరవ దివాస్ - ట్రైబల్ ప్రైడ్ డేను పురస్కరించుకుని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నాయి. పాఠశాల మైదానంలో క్రీడాజ్యోతిని వెలిగించి, శాంతి కపోతాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. విలువిద్య, వాలీబాల్ తదితర క్రీడల్లో నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు హోరాహోరీగా సాగాయి. జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన ఎం. హరి, చదరంగంలో జాతీయ స్థాయికి ఎంపికైన ఎన్. లక్ష్మీబాయిలకు పీఓ రవీంద్రారెడ్డి ట్రోఫీతోపాటు సర్టిఫికెట్‌ను అందించారు. సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు.



జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన హరికి ట్రోఫీ ప్రదానం చేస్తున్న దృశ్యం

రూ.35.52 కోట్లతో కొత్త రోడ్లు

కర్నూలు(అర్బన్): ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై)-3 బ్యాచ్-1 కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.35.52 కోట్లతో కొత్తగా ఆరు రోడ్లు, రెండు హైలెవెల్ బ్రిడ్జీలను నిర్మించేందుకు పాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి.రాజశేఖర్ జీఓఆర్‌టీ నెం.788 జారీ చేసినట్లు పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ పనులను ప్రారంభించేందుకు టెండర్లను కూడా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

సత్తా చాటిన నంద్యాల క్రీడాకారుడు



జస్వంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఆలిండియా మినీ అండర్-11 బ్యాడ్మింటన్ పోటీల్లో నంద్యాల క్రీడాకారుడు సత్తా చాటాడు. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన గౌతమి, రాజీవ్ దంపతుల కుమారుడు మహంకాళి జస్వంత్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపుతున్నాడు. ఈనెల 15 నుంచి 18 వరకు కోల్‌కత్తాలో జరిగిన 2వ ఆలిండియా మినీ అండర్-11 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో విజేతగా నిలిచి ప్రశంసలు అందుకుంటున్నాడు. సింగిల్స్ విభాగంలో బంగారు పతకం, డబుల్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ కార్యదర్శి అంకమ్మ చౌదరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వంశీధర్ శనివారం తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికే మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

మైనారిటీలకు పీఎం విశ్వకర్మ రుణాలు

కర్నూలు(అర్బన్):జిల్లాలో చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న మైనారిటీలకు (ముస్లిం, దూదేకుల, క్రిస్టియన్, మైనారిటీస్) ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రుణాలను అందించనున్నట్లు మైనారిటీ కార్పొరేషన్ ఈడీ సబీహా పర్వీన్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పథకానికి వడ్రంగి, స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు, చేప వలలు తయారు చేసే వారు, బుట్టలు, చాపలు, మట్టి పాత్రలు చేసే వారు, దోభీ, టైలర్, చెప్పులు కుట్టే వారు, తాపీ కార్మికులు, క్షురకులు, బొమ్మలు, పూల దండలు, పడవలు, ఇంటి తాళాలు తయారు చేసే వారు అర్హులన్నారు. వివరాలకు 9849901149, 9848864449, 7981848050ను సంప్రదించాలన్నారు.



కేసీలో విద్యార్థి మృతదేహం లభ్యం

కర్నూలు: స్థానిక వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువలో గల్లంతైన పవన్ కుమార్ (15) మృతదేహం బయటపడింది. జొహరాపురం వద్ద నీటిలో తేలియాడుతుండగా తల్లి దానమ్మ గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి సాయిచరణ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కోయిలకుంట్ల శాఖ(0984), నంద్యాల జిల్లా.

బహిరంగ వేలం

ఈ క్రింది తెలిపిన రుణగ్రహీతలు గోదాములో నిల్వ ఉంచిన తమ శెనగలను కుదువుగా పెట్టి 17/18/19వ సంవత్సరంలో రుణం పొంది ఉన్నారు. సదరు బకాయిలు రుణగ్రహీతలు ఈ రోజు వరకు చెల్లించుటలో విఫలమైనందున బ్యాంకు వారు రుణగ్రహీతలకు, హామీదారులకు ఆ విధంగానే యావన్మంది ప్రజానీకానికి ఇందు మూలముగా వేలం నోటీసు జారీ చేస్తూ తెలియజేయునది ఏమనగా దిగువ తెలిపిన నిల్వలను బహిరంగ వేలం ద్వారా ఈ 5-12-2023 తేదీ నుండి గోదాముల వారిగా ఉదయం 11.00 గం॥ల నుండి సరుకు మొత్తం అమ్ముడయ్యేంత వరకు విక్రయించెదరని తెలియజేయుచున్నాము. షరతులు : లోడింగ్ పాయింట్ ఆధారిత అసలు పరిమాణం మీద మరియు "ఎక్కడ ఉన్నది అక్కడ" "ఎలా ఉన్న అలాగే" అనుపద్ధతిన వేలం నిర్వహించబడను. ఏ కారణం తెలుపకనే బహిరంగ వేలం ఆపుటకు లేదా వాయిదా వేయుటకు బ్యాంకు వారికి సర్వ హక్కులు కలవు. బహిరంగ వేలం తదుపరి కూడా బకాయి పూర్తిగా రానిచో మిగిలిన సొమ్ము కొరకు బ్యాంకు వారికి గల వివిధ చట్టబద్ధ పద్ధతుల ద్వారా రుణగ్రస్తులు/హామీదారులు నుంచి రాబట్టుకుందురు. ఒకవేళ రుణగ్రహీత, హామీదారు కాని మరణించిన యెడల సదరు బహిరంగ వేలం వారి యొక్క చట్టరీత్యా వారసులకు వర్తించును. బహిరంగ వేలం నోటీసు గురించి అయిన ఖర్చులు, వ్యయములు, రుణగ్రహీతలు & హామీదారులు భరించవలెను. వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు రూ. 50,000/- ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనగలరు. మరిన్ని వివరాలకు బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగలరు. 1) రుణగ్రస్తులు మరియు హామీదారులు ఇదే చివరి నోటీసుగా భావించవలెను. 2) బహిరంగ వేలం ద్వారా ఈ దిగువ పేర్కొన్న తేదీలలో తనఖా ఉంచిన సరుకు మొత్తం అమ్ముడయ్యేంత వరకు వేలం వేయబడును. బ్యాంకు ద్వారా నోటీసు అందనివారు ఇదే చివరి నోటీసుగా భావించగలరు. 3) వేలం వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని బ్యాంక్ వారికి సర్వహక్కులు కలవు. వివరములకు సంప్రదించవలసిన సెల్ నెం. 8639387476, 9989501917.

క్ర. సం	అకౌంట్ నెం.	రుణగ్రహీత పేరు మరియు చిరునామా	బ్యాగ్స్	పరిమాణం (క్వింటాలలో)
		రాఘవేంద్ర రూరల్‌ఫార్మస్ వేర్ హౌస్, నొస్సం		
1	38561949174	కొట్టం వెంకట రమణ, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1000	600
2	38471723759	కొట్టం వెంకట రమణ, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1000	600
3	38562861866	కొట్టం సుబ్బరాయుడు, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1085	651
4	38562432666	జనపాల శివశంకర్ రెడ్డి, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1000	600
5	38631508459	జనపాల శివశంకర్ రెడ్డి, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1500	900
6	38471727908	జనపాల శివశంకర్ రెడ్డి, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1000	600
7	38450784444	ముక్కమల హుసేన్ వలి, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	800	480
8	38471726057	ముక్కమల హుసేన్ వలి, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1000	600
9	38706929451	కొట్టం లక్ష్మీదేవి, నొస్సం గ్రా॥, సంజమాల మం॥	1500	900
		ఉమా మహేశ్వర వేర్ హౌస్, కంపమల్ల		
10	37570721053	గుల్లదుర్తి వెంకటరాముడు, వనికెమ్‌దిన్నె గ్రా॥, సిరివెల్ల మం॥	340	221

తేది : 18-11-2023

సం/- చీఫ్ మేనేజర్, కోయిలకుంట్ల శాఖ, నంద్యాల జిల్లా

నాలుగున్నరేళ్ల పాలనలో సామాజిక విప్లవం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో రీజనల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవి, కాటసాని రామిరెడ్డి తదితరులు



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఈ నెల 22న బనగానపల్లె, 24న శ్రీశైలంలో బస్సుయాత్ర
- సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి
- విద్యుత్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నంద్యాల: నాలుగున్నరేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అన్న మాటకు నిజమైన అర్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో చాటి చెప్పారని విద్యుత్, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈనెల 22న బనగానపల్లెలో, 24న శ్రీశైలంలో చేపట్టే సామాజిక బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు శనివారం నంద్యాలలోని ఉదయానంద రెసిడెన్సిలో శ్రీశైలం, బనగానపల్లె నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్రా కిశోర్ రెడ్డి, ప్రజాప్రనిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ అభివృద్ధితో పాటు సామాజిక విప్లవం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 99.05 శాతం హామీలు అమలు చేయడంతో పాటు అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు చేకూర్చిన లబ్ధిని బస్సు యాత్రలో వివరించాలన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు తలెత్తుకుని జీవించేలా సీఎం జగన్ చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నిజమైన రాజ్యాధికారం దక్కిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనైనా ఇంత భారీ స్థాయిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నేతలు పదవుల్లో ఉన్నారా.. కనీసం వేదిక పైన మాట్లాడే అవకాశం కల్పించారా అనే విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. సామాజిక సాధికార యాత్ర కేవలం బస్సు యాత్ర కాదని.. మన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు చేసుకునే విజయ యాత్ర అన్నారు.

- రీజనల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు, ఉన్నత చదవులు అందించిన ఘనత దివంగత నేత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. సీఎం జగన్ ఏకంగా మైనార్టీలను చేయి పట్టి అసెంబ్లీకి నడిపించారన్నారు. పెత్తందారులు, పేదల మధ్య జరిగే యుద్ధంలో జగన్ పేదల కోసం నిలబడ్డారని, మనం జగన్ కోసం నిలబడే సమయం వచ్చిందన్నారు. చంద్రబాబు అండ్ కో ఎన్ని పొత్తులు, కుట్రలు చేసిన సీఎం జగన్ సింహంలా సింగిల్‌గానే ఎదుర్కొంటారన్నారు.
- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జగనన్న కోసం నేను సైతం అంటూ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కదం తొక్కుతున్నారని, సామాజిక సాధికార యాత్ర రూపంలో ప్రతి వర్గం సంక్షేమ పాలనకు అండగా నిలబడుతోందన్నారు. వెనుకబడిన కులాలను వెన్నెముక కులాలుగా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికలలో మరింత సుస్థిరం చేసుకోవాలన్నారు.
- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాధికారం ఒకరి చేతిలో కాకుండా ప్రతి వర్గానికి, కులానికి పంచిన నేతగా సీఎం జగన్ చరిత్రలో నిలిచారన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల గుండె జగన్.. జగన్ అని కొట్టుకోవడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ విజయభేరి గెలుపులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు భాగం కావాలన్నారు.
- బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బీసీలను చంద్రబాబు ఓటర్లుగా చూస్తే సీఎం జగన్ లీడర్లను చేశారని, మన జీవితాలు బాగు పడాలంటే మనం జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. నవరత్నాలను లంచాలు, వివక్ష లేని పాలనతో పేదల గడప వద్దకే ప్రభుత్వాన్ని చేర్చారన్నారు. రైతులు గతంలో విత్తనాల కోసం యుద్ధాలు చేసే పరిస్థితి ఉంటే మన ప్రభుత్వంలో సీఎం జగన్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నాటే సమయం నుంచి కల్లంలో ధాన్యం అమ్మే వరకు తోడుగా నిలుస్తున్నారని వివరించారు.

రగ్బీ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యా సంస్థల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్-14 బాలబాలికల పోటీలను శనివారం విద్యాశాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పోటీల పరిశీలకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి రగ్బీ విజేతల వివరాలు

బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లాపై 5-0 స్కోర్‌తో నెల్లూరు జట్టు, పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై 10-05 స్కోర్‌తో శ్రీకాకుళం జట్టు, విశాఖపట్నం జట్టుపై 5-0 స్కోర్‌తో కర్నూలు జట్టు, గుంటూరు జిల్లా జట్టుపై 5-0 స్కోర్‌తో ప్రకాశం జిల్లా జట్టు, కడప జిల్లా జట్టుపై 5-0 స్కోర్‌తో అనంతపురం జట్టు విజయం సాధించాయి.

- బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టుపై 15-0 స్కోర్‌తో కర్నూలు జట్టు విజయం సాధించింది. పశ్చిమ గోదావరి జట్టుపై 25-0 స్కోర్‌తో నెల్లూరు జట్టు, క్రిష్ణా జిల్లా జట్టుపై 1-05 స్కోర్‌తో శ్రీకాకుళం జట్టు, చిత్తూరు జిల్లా జట్టుపై 10-05 స్కోర్‌తో తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించాయి.

బేతంచెర్లలో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

బేతంచెర్ల: పట్టణంలోని అంగళ్ల బజారులోని 8 దుకాణాల్లో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు.. అంగళ్ల బాజరులోని గుండా అశ్వర్థ నారాయణ జనరల్ స్టోర్, రమేష్, చంద్రమౌలి, మెడికల్ షాపు పుల్లయ్య, కూరగాయల మహబూబ్, మణికంట జనరల్ స్టోర్, సంచుల బాషా దుకాణం షట్టర్లు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వంకధారి ప్రసాద్ షట్టర్ తెరుచుకోకపోవడంతో వదిలేసి వెళ్లారు. మిగతా దుకాణాల్లో నగదు అపహరించారు. వరుసగా ఉన్న ఈ దుకాణాల్లో ప్రణాళిక ప్రకారం చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున 2 గంటల నుంచి 3 గంటల వరకు చోరీ జరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అయితే కొద్ది మొత్తంలో నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శివ శంకర్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని దుకాణాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

26న అరుణాచలానికి బస్సు సర్వీసు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి అరుణాచల క్షేత్రానికి ఈ నెల 26వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ప్రయాణికుల సౌకర్యార్థం అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ సర్వీసు ఆదివారం ఉదయం 6 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు సోమవారం సాయంత్రం అరుణాచలం నుంచి బస్సు బయలుదేరి వేలూరు మీదుగా నంద్యాల చేరుకుంటుందన్నారు.

జూదంపై ఉక్కుపాదం

- ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల నూతన జిల్లాగా ఏర్పాటైనప్పటి నుంచి జూదంపై ఉక్కుపాదం మోపామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో పేకాటరాయుళ్ల ఆటకట్టించామని వివరించారు. జిల్లాలో పేకాటరాయుళ్లపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని అవాస్తవాలు రాయడం మంచిదికాదన్నారు. జిల్లాలో ఇప్పటికే నమోదైన 146 కేసుల్లో 641 మందిని అరెస్ట్ చేశామన్నారు. ఈ దాడుల్లో రూ.38,14,997 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వార్తలు ప్రచురించే ముందు పోలీస్ అధికారుల వివరణ తీసుకోవాలన్నారు. ఎలాంటి అవగాహన లేకుండా అవాస్తవాలు రాసి ప్రజలను తప్పుదోవపట్టించటం సరికాదన్నారు. దీనిని పోలీస్ శాఖ తరుపున ఖండిస్తున్నామన్నారు.

పేదలకు ఎంతో మేలు చేస్తున్నారు



మేము చాలా బీదోళ్లం. పనులకు పోతేనే బతుకు. లేదంటే పస్తే. మాకు ముగ్గురు బిడ్డలు. పెద్ద బిడ్డ గాయత్రి రాజనగరం హైస్కూల్‌లో 9వ తరగతి, రెండో బిడ్డ స్వప్న 8వ తరగతి చదువుతున్నారు. మూడో బిడ్డ సంజమ్మ మా ఊళ్లోనే గవర్నమెంట్ బడిలో 4వ తరగతి చదువుతోంది. పెద్దమ్మాయికి 4 ఏళ్లగా అమ్మఒడి పథకం కింద ప్రభుత్వం నగదు బ్యాంక్‌లో జమ చేస్తోంది. ఇంతకు ముందు బడులు బాగాలేవు. ఇప్పుడు పట్టణంలోని ప్రైవేటు బడిలా కనిపిస్తున్నాయి. మా ముగ్గురు బిడ్డలకు ప్రతి సంవత్సరం మంచి బట్టలు, పుస్తకాలు ఇస్తున్నారు. బడిలోనే మంచి అన్నం పెడుతుండటంతో క్యారియేర్లు అనే మాటే లేదు. బూట్లు, బ్యాగ్‌లు చాలా బాగున్నాయి. ఇంతకు ముందు అవి కొనుక్కోవాలంటే కష్టంగా ఉండేది. ఇప్పుడు ముగ్గురు బిడ్డలు డ్రస్, బూట్లు వేసుకొని బడికి పోతుంటే చాలా సంతోషంగా ఉంది. మా పెద్దమ్మాయికి 8వ తరగతిలో ల్యాప్ టాప్ కూడా ఇచ్చారు. పనులు చేసుకుంటూ బతుకుతున్న మాకు పిల్లల చదువు భారం ప్రభుత్వం తగ్గించింది. ప్రభుత్వ బడుల మీద మాకు నమ్మకం కలిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఎంతో మేలు చేస్తున్నారు.

– ఓబులమ్మ గుంప్రమాన్‌దిన్నె, శిరివెళ్ల మండలం



మళ్లీ మళ్లీ జగనే సీఎం కావాలి



నాకు వర్షధారం కింద 2.42 ఎకరాల భూమి ఉంది. గతంలో ఏటా పంటల పెట్టుబడి కోసం అప్పులు చేసే వాళ్లం. గత నాలుగున్నర ఏళ్లగా ఆ బాధలు లేవు. ఎందుకంటే రైతుల కష్టాలను తీర్చేందుకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అద్భుతం. ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట పెట్టుబడి కోసం అప్పులు చేసే పరిస్థితి లేకుండా ఏటా రూ. 13,500 విడుతల వారీగా బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. బ్యాంక్ ఖాతాలో ఇప్పటి వరకు జమ చేసిన నగదు వివరాలను తేదీల వారీగా రాసి పెట్టుకుంటున్నాను. గత ప్రభుత్వంలో ఏ సాయం అందేది కాదు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడు రుణమాఫీ చేస్తానని నమ్మించాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం విడిపోయింది, అప్పుల్లో ఉన్నాం, అంటూ మోసం చేశాడు. అదే విడిపోయిన రాష్ట్రానికి జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కోట్ల రూపాయలను వివిధ పథకాల కింద అర్హుల ఖాతాల్లో జమ చేసి ఆదుకుంటున్నారు. పింఛన్ల పంపిణీ కూడా చాలా అద్భుతంగా ఉంది. చంద్రబాబు హామీలకు గ్యారెంటీ లేదు. జగనన్న మాట మీద నిలబడే వ్యక్తి. అందుకే మళ్లీ మళ్లీ జగనన్ననే సీఎం కావాలని కోరుకుంటున్నా.

– జీవరత్నం, రైతు, పగిద్యాల